సమాచారం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్ 11కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాలలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ విజయ్‌భాస్కర్ తెలిపారు. రామాలయం ఫీడర్ పరిధిలో న్యూనల్లకుంట, సిండికేట్ బ్యాంక్, నరేంద్రపార్కు, రామాలయం తదితర ప్రాంతాలలో 9.30 నుంచి 11.30 వరకు.. శివం ఫీడర్ పరిధిలో శివం టెంపుల్, టీఆర్‌టీ క్వార్టర్స్, ప్రశాంత్‌నగర్, తరుణి సూపర్ మార్కెట్, నర్సింహ బస్తీ తదితర ప్రాంతాలలో 11.30 నుంచి 1.30 వరకు.. బ్రాహ్మణ హాస్టల్ ఫీడర్ పరిధిలో గోల్నాక, ఇందిరానగర్, బ్రాహ్మణ హాస్టల్, తిలక్‌నగర్ ఆస్పత్రి, న్యూ నల్లకుంట తదితర ప్రాంతాలలో 2.30 నుంచి 4.30 వరకు.. ఇందిరానగర్ ఫీడర్ పరిధిలో తిలక్‌నగర్, కిషన్‌రావు హాస్పిటల్ బ్యాక్ సైడ్, తిలక్‌నగర్ బ్రిడ్జ్ తదితర ప్రాంతాలలో 3 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

శుభాకాంక్షలు



కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర బీమా సంచాలకులు వి.శ్రీనివాస్‌ను ఉద్యోగులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బీమా నిర్దేశాలయ అధికారులు ఎల్ఎల్ మార్గరెట్, బి.నరేందర్‌కుమార్, టీఎన్జీవోల అధ్యక్షుడు ఎస్.సూర్యనారాయణ, ఎస్.దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆదర్శ వివాహాలను ప్రోత్సహించాలి'

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కులాంతర వివాహాలు కుల నిర్మూలనకు బాటలు వేస్తాయని ఎస్‌బీకే కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్ అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్, పీఎస్ఎం సంయుక్త ఆధ్వర్యంలో రూప, శేఖర్ల వివాహం జరిగింది. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఆదర్శ వివాహాలను ప్రోత్సహిస్తే సమాజంలో అంతరాలు తగ్గుతాయన్నారు. కులాంతర వివాహం చేసుకున్న వారికి భద్రత కల్పించడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, టీపీఎస్‌కే కార్యదర్శి జి.రాములు, రచయిత జూపాక సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

రేపు చిక్కడపల్లిలో 'ఏ-వన్ టీ' బ్రాంచ్ ప్రారంభం

కాచిగూడ: చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఈ నెల 5న 'ఏ-వన్ టీ' సంస్థ బ్రాంచ్ ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ జకి పటేల్ తెలిపారు. రఫియా పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొని టీ సెంటర్ ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా సంస్థ ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. 5 రోజుల పాటు ప్రతిరోజూ రూ.100 కొనుగోలుపై ఒక కూపన్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజూ రాత్రి డ్రా ఉంటుందని, గెలుపొందిన వారికి 1 గ్రాము గోల్డ్ కాయిన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. లక్కీ కూపన్ల ద్వారా ప్రతిరోజూ ఇద్దరిని ఎంపిక చేసి వారికి ప్రతి నెలా ఒక కిలో టీ పోడి సంవత్సరం పాటు అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అభినందన



ఐపీఎం డైరెక్టర్ శివలీలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సుశీల్‌కుమార్

కాచిగూడ: టీఎస్ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ఐపీఎం బ్రాంచ్ అధ్యక్షుడు రాసూరి జ్ఞానేశ్వర్, కార్యదర్శి బంగ్లా సుశీల్‌కుమార్ ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధులు ఐపీఎం డైరెక్టర్ డాక్టర్ సి.శివలీలను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎం.రాజు, టి.వెంకటేష్, సీహెచ్ క్రిష్ణమూర్తి, పగడాల సుధాకర్, ఆర్.నరేష్, జైనుల్లాబుద్దీన్, మహ్మద్ హుస్సేన్, ఎన్.ఈశ్వరమ్మ, పి.ప్రకాష్, ఎ.నర్సింహ, మురళీధర్‌రావు, ఎన్.శ్రీను, పి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి



అవార్డులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న తదితరులు



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు

కవాడిగూడ: బాలికల అక్షరాస్యత కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత నాయకురాలు సావిత్రిబాయి పూలే అని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ అన్నారు. మహిళల్లో చైతన్యం తీసుకువచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు సావిత్రిబాయి చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. సావిత్రిబాయి పూలే 192వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం ఇందిరాపార్కు చౌరస్తాలో ఓబీసీ మోర్చా కవాడిగూడ అధ్యక్షుడు చిత్రకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కార్పొరేటర్ రచనశ్రీ, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, రాష్ట్ర నాయకుడు జి.వెంకటేష్ హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కవాడిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో కార్పొరేటర్ రచనశ్రీ సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కె.పరిమళ్‌కుమార్, రంగరాజన్‌గౌడ్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.సి మహేందర్‌బాబు, ఎ.ప్రభాకర్‌గంగపుత్ర, ఆంజనేయులు, రమేష్‌గౌడ్, హరీష్‌గౌడ్, దిలీప్‌యాదవ్, శివరాజ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, మహిళా సంఘం నేతలు

బీజేపీ నగర కార్యాలయంలో..

కాచిగూడ: మహిళలకు విద్య ఆభరణం కావాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. మంగళవారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సి.వినోద్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సి.నందకిషోర్‌యాదవ్ దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్, ఎం.బి.కిషోర్‌కుమార్, ఆనంద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈబీసీ సెంట్రల్ కమిటీ కార్యాలయంలో..

కాచిగూడ: ఈబీసీ కమిషన్‌కు చట్ట బద్ధత కల్పించాలని, మహిళా బిల్లులో ఈబీసీ మహిళలకు సబ్‌కోటా కల్పించాలని ఈబీసీ సెంట్రల్ కమిటీ జాతీయ అధ్యక్షురాలు చెప్యాల లతారెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మంగళవారం కాచిగూడలోని ఈబీసీ సెంట్రల్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సంజీవయ్యనగర్‌లో..

నల్లకుంట: గాడ్గేబాబా దళిత సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం నల్లకుంట సంజీవయ్యనగర్‌లోని అంబేడ్కర్ శతాబ్ది భవన్‌లో సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. గాడ్గేబాబా దళిత సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ స్వామి అల్వాల్, బడుగు బలహీన వర్గాల ఐక్య వేదిక అధ్యక్షుడు ఎరుకల మహేందర్‌గౌడ్ హాజరై ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అవార్డుల ప్రదానం..

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: గొప్ప మానవతామూర్తి సావిత్రిబాయి పూలే అని ఎమ్మెల్సీ, వాగ్గేయకారుడు గోరేటి వెంకన్న అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మహాజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 192వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులను కళారత్న, సేవారత్న, శ్రమరత్న, దళిత రత్న, బీసీ రత్న అవార్డులతో ఘనంగా సత్కరించారు.

ముషీరాబాద్: స్త్రీ విద్య కోసం అహర్నిశలు శ్రమించడంతో పాటు బాలికల కోసం మొదటిసారి పాఠశాలను ప్రారంభించిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని పలువురు అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో వెస్ట్ మారెడుపల్లి పాఠశాల, కోఠి ఉమెన్స్ కళాశాలలో ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలుపుతూ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.ఝాన్సీ మాట్లాడుతూ.. మహిళల విద్య, అభివృద్ధి కోసం సావిత్రిబాయి పూలే కృషి చేశారని కొనియాడారు.



బీజేపీ నగర కార్యాలయంలో దుస్తులు పంపిణీ చేస్తున్న నందకిషోర్‌యాదవ్



సావిత్రిబాయి పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న స్వామి అల్వాల్



సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న కృష్ణమోహన్

రైల్వే టికెట్ చెకింగ్ సిబ్బంది సేవలు ప్రశంసనీయం

కాచిగూడ: రైల్వే టికెట్ చెకింగ్ సిబ్బంది విధి నిర్వహణతో పాటు మానవతా దృక్పథంతో ప్రయాణికులకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ అన్నారు. రైల్వే టికెట్ చెకింగ్ సిబ్బంది 2022లో అందించిన సేవల వివరాలతో 'కర్మయోగి' పేరుతో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను రైల్ నిలయంలో అరుణ్‌కుమార్‌జైన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ జి.జాన్‌ప్రసాద్, ఇండియన్ రైల్వే టికెట్ చెకింగ్ స్టాఫ్ ఆర్గనైజేషన్ జాతీయ సంయుక్త కార్యదర్శి కె.శంకర్, హైదరాబాద్ డివిజనల్ సెక్రటరీ ఎం.కె.ఉదయ్‌భాస్కర్, ట్రెజరర్ వి.వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న అరుణ్‌కుమార్‌జైన్

వైద్యుల నియామకం మంచి నిర్ణయం



కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్

నల్లకుంట: ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన వైద్యుల నియామకాలు చేపట్టడం మంచి నిర్ణయమని నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.శంకర్ అన్నారు. తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్(టీఎంహెచ్ఈయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్ ఆధ్వర్యంలో మంగళవారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. హాజరైన ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సమక్షంలో కేక్ కట్ చేసిన అనంతరం డాక్టర్ శంకర్ మాట్లాడారు. ప్రపంచంలోని వివిధ దేశాలలో కోవిడ్-19 కొత్త వేరియంట్స్ దడ పుట్టిస్తున్నాయని, ఆ వైరస్‌తో మనకు ప్రమాదం లేనప్పటికీ ప్రజలు కోవిడ్ నిబంధనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టీఎంహెచ్ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు రాబర్ట్ బ్రూస్, ఫీవర్ ఆస్పత్రి సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ జయలక్ష్మి, డిప్యూటీ ఆర్ఎంవో డాక్టర్ చంద్రశేఖర్, వైరాలజీ ల్యాబ్ ఇన్‌చార్జ్ డాక్టర్ శైలజ, డాక్టర్ హరిత తదితరులు పాల్గొన్నారు.

7న 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

కవాడిగూడ: తెలంగాణ రాష్ట్ర సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ సౌజన్యంతో ఈ నెల 7న 10వ తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రంలో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు గాంధీ సంస్థల తెలంగాణ, ఏపీ రాష్ట్రాల చైర్మన్ గున్నా రాజేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ యానాల ప్రభాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసి, భవిష్యత్తులో ఉత్తమ పౌరులను భారతావనికి అందించాలనే లక్ష్యంతో రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాలలో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ టెస్ట్‌లో ప్రభుత్వ, రెసిడెన్సియల్, ప్రైవేట్ విద్యా సంస్థల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 9705806581, 9989334849 నెంబర్‌లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో గాంధీ సంస్థల ఉపాధ్యక్షుడు గాంధారి ప్రభాకర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కే.సుభాష్‌చంద్ర, తెలంగాణ రాష్ట్ర సాంఘిక శాస్త్ర ఫోరం అధ్యక్షుడు జి.రథంగరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రాజేందర్‌రెడ్డి

హస్తకళల ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన



ఎగ్జిబిషన్‌ను సందర్శించిన ఏపీ హస్తకళల చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఢిల్లీశ్వర్‌రావు తదితరులు

కవాడిగూడ: ఏపీ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో లేపాక్షి ఎంపోరియంలో నిర్వహించిన ఎగ్జిబిషన్‌కు అన్ని వర్గాల ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని హైదరాబాద్ లేపాక్షి ఎంపోరియం మేనేజర్ ఢిల్లీశ్వర్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నందగిరి హిల్స్‌లోని లేపాక్షి ఎంపోరియంలో ఈ ఎగ్జిబిషన్ నిర్వహించారని ఆయన చెప్పారు. హస్తకళాకారులను ఆదుకునేందుకు ఏపీ ప్రభుత్వ సహకారంతో ఎగ్జిబిషన్ నిర్వహించినట్లు ఆయన వివరించారు. ఎగ్జిబిషన్ విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బి.విజయలక్ష్మి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

చిక్కడపల్లి: పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో దోహదం చేస్తాయని బచ్‌పన్ విద్యా సంస్థల డైరెక్టర్ రూపారెడ్డి అన్నారు. మంగళవారం గాంధీనగర్ డివిజన్‌లోని బచ్‌పన్ ప్లే స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శనను ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. విద్యార్థులకు చిన్ననాటి నుంచే ఆటపాటలతో కూడిన పాఠ్యాంశాలను బోధించాలని అన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు రూపొందించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంక్షేమంలో దేశానికి రోల్‌మోడల్ తెలంగాణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

కాచిగూడ: భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నేత డాక్టర్ బద్దుల ఓంప్రకాష్‌యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను మంగళవారం కాచిగూడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ.. దేశ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే సత్తా సీఎం కేసీఆర్‌కు ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ దేశానికి రోల్ మోడల్‌గా మారిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బద్దుల శిరీష యాదవ్, దిడ్డి రాంబాబు, ఎర్ర భీష్మదేవ్, కె.సదానంద్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, బి.కృష్ణాగౌడ్, మహేష్‌కుమార్, నర్సింగ్‌బాబు, బబ్లూసింగ్, శేషు, ఎల్.రమేష్, శ్రీకాంత్‌యాదవ్, పట్నూరి సతీష్, బబ్బి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

డివైడర్‌ను ఢీకొన్న కారు.. ఒకరి మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం తెల్లవారుజామున రామచంద్రాపురం పట్టణంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. హైదరాబాద్ నగరంలోని అంబర్‌పేటకు చెందిన ఎండీ సాజిత్(28) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో అతడి స్నేహితులు సుల్తాన్, ఇంతియాజ్‌తో కలిసి లింగంపల్లి వైపు నుంచి పటాన్‌చెరులోని ఇస్నాపూర్‌కు కారులో బయలుదేరారు. అశోక్‌నగర్ సమీపంలో వేగంగా వెళ్తున్న కారును అదుపు చేయలేక డివైడర్‌ను ఢీకొట్టారు. అదే సమయంలో ఎడమవైపు ఆగి ఉన్న ప్రైవేట్ బస్సును ఢీకొట్టారు. తీవ్ర గాయాలపాలైన ముగ్గురిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే సాజిత్ మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

చిక్కడపల్లి: సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని బీసీ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. మోహన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం త్యాగరాయ గానసభలో ఎన్టీఆర్, ఘంటసాల శత జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభినయ ప్రదర్శన నిర్వహించిన ప్రొఫెసర్ శ్రీదేవి, ఉషాకుమారిలను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ.. నిర్వాహక సంస్థ వారు లక్ష కిలోల బియ్యం ఉచితంగా పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో గానసభ రెనోవేషన్‌కు రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దైవజ్ఞశర్మ, నిర్వాహకులు మోహన్‌గాంధీ తదితరులు పాల్గొన్నారు.



అతిథులను సన్మానిస్తున్న వెంకటేశం, శ్రీనివాస్‌యాదవ్

'బీసీల సంక్షేమానికి రూ.లక్ష కోట్లు కేటాయించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్‌పటేల్‌గౌడ్

కాచిగూడ: బీసీల సంక్షేమం, అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.లక్ష కోట్లు కేటాయించాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశ జనాభాలో 70కోట్ల మంది బీసీలు ఉన్నారని, వారి అభివృద్ధికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. రాజకీయ రంగంలో బీసీలకు సముచిత ప్రాధాన్యత దక్కేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నల్లెల కిషోర్, ప్రదీప్‌గౌడ్, ధీరేంద్రయాదవ్, పులిజాల కృష్ణ, పేరం నాగేశ్వర్‌రావు, ప్రశాంత్ నిమ్‌కర్, నేమూరి సాంబశివగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'త్వరలో ముషీరాబాద్ బీజేపీకి షాక్'

- బీజేపీని వీడే యోచనలో మహిళా మోర్చా మాజీ రాష్ట్ర కార్యదర్శి విజయలక్ష్మి
- నేడో, రేపో ఎమ్మెల్సీ కవిత సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరే అవకాశం



డాక్టర్ విజయలక్ష్మి

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో బీజేపీకి ఒకటి రెండు రోజుల్లో గట్టి షాక్ తగలనున్నట్లు తెలుస్తోంది. సోమవారం నిర్వహించిన చిక్కడపల్లి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ బ్యానర్లలో బీజేపీ సీనియర్ నాయకురాలు డాక్టర్ విజయలక్ష్మి ఫొటో ప్రత్యక్షం కావడంతో పాటు ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొనడం ఈ అనుమానాలకు తావిస్తోంది. ఈ అంశం బీజేపీ, బీఆర్ఎస్ వర్గాలలో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై సాక్షి ఆరా తీయగా అనేక విషయాలు తేటతెల్లమయ్యాయి. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా, రాంనగర్ డివిజన్ అధ్యక్షురాలిగా, డెంటల్ డాక్టర్‌గా అందరికీ పరిచయమున్న డాక్టర్ విజయలక్ష్మి త్వరలోనే ఎమ్మెల్సీ కవిత, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. ఇప్పటికే బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో ఒకటి రెండు సార్లు సమావేశమై తుది నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం కేరళలో ఉన్న కవిత హైదరాబాద్ రాగానే ఆ పార్టీలో చేరనున్నట్లు తెలుస్తోంది. విజయలక్ష్మి పార్టీని వీడడానికి గల కారణాలపై ఆరా తీయగా.. రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శిగా బాధ్యతలు వీడి మూడు సంవత్సరాలైనా ఇప్పటి వరకు ఎలాంటి బాధ్యతలు అప్పగించకపోవడం పట్ల ఆమె తీవ్ర అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం.

పార్టీ పట్టించుకోవడం లేదనే..

తనకు ఏదైనా బాధ్యత అప్పగించాలని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌ను, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను పలుమార్లు కలిసినప్పటికీ ఫలితం లేకపోవడమే ఆమె అలకకు కారణంగా తెలిసింది. దీంతో పాటు ఆమె ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు చిక్కడపల్లి వెంకటేశ్వరస్వామి గుడి వద్ద బాదం పాలను ఉచితంగా పంపిణీ చేస్తుంటారు. దీనికి బీజేపీ నాయకుల నుంచి సహకారం అడిగినా స్పందన కరువైనట్లు సమాచారం. పార్టీ కార్యక్రమాలకు సైతం తనను పిలవడం లేదని, బతుకమ్మ సంబరాలు, బీజేపీ సంస్థాగత సమావేశాలకు సైతం ఆహ్వానం అందడంలేదని ఆమె ఆరోపిస్తున్నారు. డాక్టర్ కె.లక్ష్మణ్ రాజ్యసభ సభ్యుడు అయిన తరువాత ముషీరాబాద్ బీజేపీలో ఎవరికి వారే అన్నట్లుగా ఉందని, కన్వీనర్‌గా రమేష్‌రాం రెండవసారి ఎన్నికైన తరువాత ఈ పరిస్థితి మారదని భావించే తాను బీఆర్ఎస్‌లో చేరేందుకు నిర్ణయించుకున్నట్లు ఆమె సాక్షికి వివరించారు. తాను బీఆర్ఎస్‌లో చేరుతున్న విషయం బయటకు రావడంతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు ఫోన్ చేసి పార్టీ బాధ్యతలు అప్పగిస్తామని హామీ ఇస్తున్నారని, ఇప్పటి వరకు వారంతా ఎక్కడికి వెళ్లారని ఆమె ప్రశ్నిస్తున్నారు.